ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 08-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్ శ్రామిక శక్తిలో మహిళలు అధిక భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- వచ్చే ఐదేళ్లలో వైద్య విద్యలో 75వేల కొత్త సీట్లను చేర్చాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు.
- జవాబుదారీతనం ఉండేలా జరిగే చర్చలకు శాసన సంస్థలు కేంద్రాలుగా మారాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తి సాధించిన విజయాలను, దేశానికి, సమాజానికి వారు చేసిన విశిష్ట సేవలను గౌరవించే సందర్భం అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సందేశంలో పేర్కొన్నారు.

మహిళలు సమాజానికి వెన్నెముక అని, నాయకత్వంతో పరివర్తనాత్మక మార్పును సాధిస్తారని ఉపరాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.

వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్ శ్రామిక శక్తిలో ఎక్కువ మంది మహిళలు ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో 'నారీ శక్తి సే విక్షిత్ భారత్' అనే అంశంపై జరిగిన ఒక రోజు సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. అభివృద్ధి చెందిన భారతదేశ దార్శనికతను సాకారం చేయడంలో దేశ ఆడబిడ్డలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఉద్ఘాటించారు. దేశంలోని మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్..40 సెకన్లు)-నెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్ లోని నవ్సారిలో ఈరోజు జరిగిన 'లఖ్ పతి దీదీ సమ్మేళనం'లో మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25 వేల స్వయం సహాయక సంఘాల మహిళలకు 450 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని మోదీ అందించి, జి-సఫల్, జి-మిత్రతో సహా పలు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి దిశగా భారత్ పురోగమిస్తోందని కొనియాడారు. మహిళల గౌరవానికి, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని మోడీ తెలియజేస్తూ..

(వాయిస్..40 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవాళి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నారీ శక్తి ప్రభావం అపారంగా ఉందని జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ గాంధీనగర్ లోని పద్మశ్రీ పద్మ సచ్ దేవ్ ప్రభుత్వ మహిళా కళాశాల సహకారంతో బుద్ధ ఆర్ట్ అండ్ పెయింటింగ్ నిర్వహించిన 'సశక్త్ నారీ సమ్మాన్' కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. సమకాలీన కళలు, చేతి వృత్తుల రంగంలో మహిళల భాగస్వామ్యం, ఆ రంగాన్ని సుసంపన్నం చేసిందని మనోజ్ సిన్హా మాట్లాడుతూ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జవాబుదారీతనం ఉండేలా జరిగే చర్చలకు శాసన సంస్థలు కేంద్రాలుగా మారాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఈరోజు 'కాన్ స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ రాజస్థాన్' ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులను ఉద్దేశించి ఓం బిర్లా ప్రసంగించారు. కాన్ స్టిట్యూషన్ క్లబ్ కేవలం భవనం మాత్రమే కాదని, ప్రజాస్వామిక చర్చకు, ఆలోచనాత్మకతకు, విధాన రూపకల్పనకు మార్గనిర్దేశం చేసే వేదిక అని స్పీకర్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం ఎన్నికలకే పరిమితం కాదని, నిరంతర చర్చలు, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతుందని స్పీకర్ తెలియజేస్తూ..

(వాయిస్..26 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం మహిళల నేతృత్వంలోని అభివృద్ధిపై దృష్టి సారించిందని, మహిళా సాధికారతే లక్ష్యంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందని బిజెపి అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ.. మహిళా సాధికారతను తమ ప్రాథమిక సూత్రంగా బీజేపీ ఎప్పుడూ భావిస్తుందని  అన్నారు. మహిళలు సాధికారత సాధించినప్పుడే ప్రపంచం అభివృద్ధి చెందుతుందనేది ప్రధానమంత్రి మోదీ విశ్వాసమని నడ్డా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే ఐదేళ్లలో వైద్య విద్యలో 75వేల కొత్త సీట్లను చేర్చాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. ఈ రోజు ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఇంటర్నేషనల్ సింపోజియం ఆన్ హెల్త్ టెక్నాలజీ అసెస్మెంట్ (ఇష్టా) 2025 ప్రారంభ సమావేశంలో నడ్డా ప్రసంగించారు. 2014 నుంచి దేశంలో మెడికల్ కాలేజీల సంఖ్య

101 శాతం పెరిగిందని మంత్రి అన్నారు. పారామెడికల్, నర్సులు, ముందు వరుసలో ఉన్న కార్మికులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఆరోగ్య సంరక్షణ రంగాన్ని విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని జే పి నడ్డా పేర్కొంటూ..

(వాయిస్..40 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతాలను స్ఫూర్తిదాయక మహిళలకు అప్పగించారు. ఉదయం నుంచి అసాధారణ మహిళలు తమ ప్రయాణాలను పంచుకుంటూ, ఇతర మహిళలకు స్ఫూర్తిదాయకమైన సందేశాలు పెడుతున్నారని మోదీ సామాజిక మాధ్యమ సందేశంలో పేర్కొన్నారు. విక్షిత్ భారత్ ను రూపొందించడంలో వారు చేసిన కృషిని దేశం కొనియాడుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చెస్ క్రీడాకారిణి ఆర్.వైశాలి, విజయవంతంగా అంకుర సంస్థను నడుపుతున్న.. నలందా జిల్లాకు చెందిన యువతి  అనితాదేవి ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ ఖాతాలలో తమ విజయ గాథలు పంచుకున్న వారిలో ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత మహిళల కబడ్డీ జట్టు ఐదోసారి ఆసియా చాంపియన్ గా నిలిచింది. ఈరోజు టెహ్రాన్ లో జరిగిన ఆరో ఆసియా మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 32-25తో ఆతిథ్య ఇరాన్ ను ఓడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దుబాయ్ వేదికగా రేపు చాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్ మ్యాచ్ లో భారత్–న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. సెమీ ఫైనల్స్ లో ఆస్ట్రేలియాపై భారత విజయం సాధించగా, న్యూజిలాండ్.. సౌత్ ఆఫ్రికా పై విజయం సాధించి ఫైనల్స్ కు చేరుకున్నాయి. ఫైనల్ లో న్యూజిలాండ్ ను ఓడించి మూడో సారి చాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. ఫైనల్ మ్యాచ్ రేపు మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =